## తాగునీటి సమస్య లేకుండా చూడాలి : కలెక్టర్

సూర్యాపేట, మే 5: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రతి వారం సమీక్ష నిర్వహించి వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ అప్పారావు, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూఓ నరసింహారావు, సీపీఓ కిషన్, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఏవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మృతికి సంతాపం

సూర్యాపేట లీగల్, మే 5: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మృతికి సంతాపంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కోర్టు విధులను తాత్కాలికంగా నిలిపివేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సూర్యాపేట న్యాయస్థానం విధులను తాత్కాలికంగా నిలిపివేశారు. అనంతరం సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.లింగయ్య అధ్యక్షతన న్యాయవాదుల విశ్రాంతి భవనంలో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సంతాప సభలో సూర్యాపేట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.మధు, కార్యదర్శి ఎస్.రాజు, శ్రీనివాస్‌రావు, జె.శశిధర్, వై.వెంకటబుచ్చేశ్వర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## 'పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలి'



బడిబాటలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తుంగతుర్తి, మే 5: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అన్నారు. సోమవారం ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందజేయడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు.

## స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



సుహాసిని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

నాగారం, మే 5: మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బొంతకొల్ల సుహాసిని భర్త కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సుహాసినితో పాటు ఫణిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన స్నేహితులంతా కలిసి రూ.30 వేలు సేకరించి సోమవారం ఆమె కుటుంబానికి అందజేశారు. సుహాసిని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మణికుమార్, సురేశ్, పాషా, సతీశ్, సుధాకర్, ఉపేందర్, శ్రీను, నరేశ్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

● ఆర్డీఓ శ్రీనివాసులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు, సీఐ చరమందరాజు

మఠంపల్లి, మే 5: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగనున్న తిరుకల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. సీఐ చరమందరాజుతో కలిసి ఆలయ ప్రాంగణంలో పార్కింగ్, కల్యాణ మండపం, కోలాటం, భజనలు వేసే స్థలం తదితర ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, ఎస్ఐ పి.బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి'



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజలు

చిట్యాల, మే 5: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని పీఆర్‌పీఎస్ అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలతో కలిసి పీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన వారికే ఇస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అర్హులను ఎంపిక చేసి వారికే ఇండ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కాల గోపాల్, ఉయ్యాల లింగస్వామి, నాగిళ్ల యాదయ్య, బర్రె సంజీవ, ఆవుల నర్సింహ, మాదగోని పద్మ, గునగంటి అండాలు తదితరులు పాల్గొన్నారు.

## 'మహిళా కూలీల జాతీయ సదస్సును జయప్రదం చేయాలి'



ముత్తిరెడ్డిగూడెంలో మహిళా కూలీలతో మాట్లాడుతున్న పద్మ

భువనగిరి కలెక్టరేట్, మే 5: కేరళ రాష్ట్రంలోని మల్లాపురం పట్టణంలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరుగనున్న మహిళా వ్యవసాయ కూలీల జాతీయ సదస్సును జయప్రదం చేయాలని మహిళా కూలీల సంఘం రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ పిలుపునిచ్చారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా కూలీల సమస్యలపై అధ్యయనం చేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు అవుతున్నా నేటికీ మహిళలు అన్ని రంగాల్లో వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల కోసం ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ రోజురోజుకూ దాడులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తున్నా వేతనం విషయం వివక్ష చూపుతున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ సదస్సులో మహిళా కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పద్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కాకుమారి, పల్లెర్ల అంజయ్య, అంతరి సత్తమ్మ, మాధవి, సువర్ణ, స్వాతి, కవిత, బొమ్మకంటి బాలమణి, కొండ పోచమ్మ, అందె అఖిల తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



తాళ్లమల్కాపురంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

గరిడేపల్లి, మే 5: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. మండల పరిధిలోని రాయినిగూడెం, తాళ్లమల్కాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సూర్యాపేట జిల్లాలో గరిడేపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టం ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. గతంలో ప్రజలు తాసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులే గ్రామాలకు వచ్చి ప్రజల సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారని వివరించారు. రెవెన్యూ సదస్సులో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, విచారణ అనంతరం నెల రోజుల్లో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. రాయినిగూడెంలో 140, తాళ్ల మల్కాపురంలో 73 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్, కోదాడ ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, గరిడేపల్లి, కోదాడ తాసీల్దార్లు బి.కవిత, వాజీద్‌అలీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, రాంబాబు, తబ్రేజ్, రైతులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా పోలీసులు: ఎస్పీ నరసింహ



ప్రజావాణి ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 5: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. బాధితులకు పోలీసులు అండగా ఉంటూ ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్టపరిధిలో పరిష్కరిస్తూ బాధితులకు వేగంగా న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

## వ్యర్థాలను తరలిస్తున్న కంటైనర్ల పట్టివేత

చివ్వెంల, మే 5: వివిధ ప్రాంతాల నుంచి పెద్ద పెద్ద కంటైనర్ల ద్వారా చికెన్ వ్యర్థాలను తీసుకొచ్చి మండల పరిధిలోని అక్కలదేవిగూడెం శివారులో సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి వెంట వదులుతుండంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం రాత్రి అక్కలదేవిగూడెం శివారు ప్రాంతానికి చేరుకున్న పోలీసులు రెండు కంటైనర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు. అనంతరం జన సంచారం లేని ప్రాంతాల్లో వ్యర్థాలను వదలాలని ఆదేశించడంతో డ్రైవర్లు అక్కడి నుంచి వ్యర్థాలను తరలించినట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సూర్యాపేట టౌన్, మే 5: సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరమని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం సూర్యాపేటలోని తన నివాసంలో సోమవారం 11 మంది లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అనారోగ్యం బారినపడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, షఫిఉల్లా, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేశ్‌నాయుడు, తండు శ్రీనివాస్‌గౌడ్, కొండగడుపుల సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

నాగారం, మే 5: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి బత్తుల రవి రైతులకు సూచించారు. సోమవారం మండల కేంద్రం నాగారంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 90 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు నాగారం మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పసునూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ నాగరాజు, టి.మురళి, గోపాలమిత్ర లింగమల్లు, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సాహితీ సంబురాలకు సూర్యాపేట వాసికి ఆహ్వానం

సూర్యాపేట టౌన్, మే 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులో ఈ నెల 10, 11 తేదీల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబురాలకు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత, సామాజికవేత్త పోతుగంటి వీరాచారికి సోమవారం ఆహ్వానం అందింది. సాహితీ సంబురాల్లో వీరాచారి కవితాగానం చేయనున్నారు.

## సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కమిటీ ఎన్నిక



సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు

నాగారం, మే 5: మండల కేంద్రం నాగారంలో ఏర్పాటు చేయనున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ కమిటీని గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలగాని మురళి, ఉపాధ్యక్షుడిగా అనంతుల వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా అనంతుల యాదగిరి, కోశాధికారిగా ఉపేందర్, అనంతుల సోమేశ్, బందారపు సతీశ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా కమిటీ సభ్యులుగా అనంతుల సోమశేఖర్, బందారపు వెంకన్న, బందారపు మహేందర్, పాముకుంట్ల వెంకన్న, అనంతుల మల్లయ్య, చంద్రమ్మ, పరమేశ్, బాలగాని మల్లికార్జున్, అనంతుల మల్లయ్య, సాయి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండల్‌రావు

తుర్కపల్లి, మే 5: వివాహితను వేధిస్తున్నాడన్న కారణంతో యువకుడిని హత్య చేసిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో యాదగిరిగుట్ట సీఐ కొండల్‌రావు, ఎస్ఐ తక్యూద్దీన్ సోమవారం కేసు వివరాలను వెల్లడించారు. మండలంలోని గోపాల్‌పురం గ్రామానికి చెందిన దాసారం సాయికుమార్ (21) అదే గ్రామానికి చెందిన వివాహితను 6 నెలలుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. మహిళ ఈ విషయాన్ని భర్త తలారి ఆంజనేయులుకు తెలిపింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆంజనేయులు ఎలాగైనా సాయికుమార్‌ను హతమార్చాలని పన్నాగం పన్నాడు. ఇందుకోసం తన స్నేహితులు తలారి కొండయ్య, తలారి వెంకటేశ్వర్లుతో పాటు సిద్దిపేట జిల్లా ములుగు మండలం బలింపురం గ్రామానికి చెందిన గువ్వ రమేశ్ సహాయం తీసుకున్నాడు. ఈ నెల 2న గోపాల్‌పురం గ్రామ సమీపంలోని తన వ్యవసాయ బావి వద్ద సాయికుమార్ ఉన్నాడన్న సమాచారం అందుకున్న నలుగురు వ్యక్తులు అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలోనే ఆంజనేయులు తన వద్ద ఉన్న ఇనుపరాడ్డుతో సాయికుమార్ తలపై కొట్టి అక్కడే ఉన్న డ్రిప్ ఇరిగేషన్ పైపును మెడకు చుట్టి హతమార్చాడు. అనంతరం నలుగురు కలిసి మృతదేహాన్ని ఆటోలో ములుగు మండలం సింగన్నగూడెం గ్రామ సమీపంలోని దాసర్లపల్లి – బసలపురం రోడ్డులో గల బ్రిడ్జి కింద డీజిల్ పోసి కాల్చేశారు. సాయికుమార్ తండ్రి రామయ్య ఈ నెల 2న తన కొడుకు కనిపించడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ కొండల్‌రావు పర్యవేక్షణలో ఎస్ఐ తక్యూద్దీన్ విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలతో పాటు సాయికుమార్ తండ్రి రామయ్య వెల్లడించిన వివరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. తన భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడనే కారణంగానే సాయికుమార్‌ను హత్య చేసినట్లు ఆంజనేయులు ఒప్పుకున్నాడు. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలు

మద్దిరాల, మే 5: తాటిచెట్టు పైనుంచి కిందపడి మండలంలోని పోలుమల్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు రాగిరి ఎల్లయ్య గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లయ్యగౌడ్ సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కే క్రమంలో కాలుజారి చెట్టుపై నుంచి కిందపడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి తక్షణమే చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సేవాశ్రమంలో అన్నదానం

కోదాడ రూరల్, మే 5: కోదాడ పట్టణ పరిధి అశోక్‌నగర్‌లోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల సేవాశ్రమంలో చిలుకూరు మండల ఏఐవైఎఫ్ అధ్యక్షుడు అనంతు రాములు, ఉష దంపతుల కుమార్తె చెన్విత పుట్టిన రోజు సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సేవాశ్రమ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

## 'రైతు అవగాహన సదస్సును విజయవంతం చేయాలి'

మునగాల, మే 5: విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తనాల నాణ్యత, మొలక శాతం పరీక్ష చేసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని ఏఓ బుంగ రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## 'మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి'

ఆత్మకూర్.ఎస్, మే 5: హైదరాబాద్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా అందాల పోటీల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని అన్నారు. హామీలను అమలు చేయమంటే డబ్బులు లేవంటున్నారని, ఇలాంటి పోటీల నిర్వహణకు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. పోటీలను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో మిస్ వరల్డ్ పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో వివిధ మహిళా సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

## రజక వృత్తిదారుల సంఘం సహాయ కార్యదర్శిగా వెంకటేశ్



వడ్డెబోయిన వెంకటేశ్

భువనగిరి కలెక్టరేట్, మే 5: తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భువనగిరికి చెందిన వడ్డెబోయిన వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఏకగ్రీవ తీర్మానంతో వెంకటేశ్‌ను సహాయ కార్యదర్శిగా ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ విలేకరులతో మాట్లాడుతూ లాండ్రీలకు, ఇస్త్రీ షాపులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ బిల్లులను వృత్తిదారులు చెల్లించాలని విద్యుత్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, వెంటనే వేధింపులను ఆపాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి

పాలకవీడు, మే 5: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకుండా, ముఖ్యమంత్రి ఆ శాఖను తన వద్ద ఉంచుకున్నారని, విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిటాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెండింగ్‌లోని ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఉన్నత విద్యకుంటుపడిందని అన్నారు. గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో పేద విద్యార్థులు గురుకులాలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు ఇవ్వాలని, విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని, గురుకులాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, మంద నాగయ్య, సైదిరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య'



గరిడేపల్లి మండలంలోని పొనుగోడులో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

నేరేడుచర్ల, మే 5: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటరమణ అన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరుతూ సోమవారం నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 82 శాతంతో జిల్లాలోనే నేరేడుచర్ల జూనియర్ కళాశాల రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. విద్యార్థులు ప్రైవేట్‌కు వెళ్లకుండా ప్రభుత్వ కళాశాలలో చేరి నాణ్యమైన విద్యను పొందాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, శ్రీనివాసులు, వెంకన్న, ప్రణతి, నరసింహాచారి, సునీత, గణేశ్, నరేందర్, అపర్ణ, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈఓ సత్యనారాయణరెడ్డి




శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల, మే 5: నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి సూచించారు. ప్రభుత్వ ఆదేశానుసారం సోమవారం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో వేసవి శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి శిబిరాలు తోడ్పడుతాయని, విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే శిబిరంలో క్రీడలు, స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటు యోగా, సాంస్కృతిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, పీడీఎం యాదగిరి, ఉపాధ్యాయులు బాలు, సైదులు, లాల్‌సాహెబ్, శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## చౌటపల్లిలో మేడే వారోత్సవాలు




మేడే వారోత్సవాల్లో సీఐటీయూ నాయకులు

మఠంపల్లి, మే 5: మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో మేడే వారోత్సవాలను సోమవారం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను నాయకుడు గుండెపంగు కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా, దేవదానం, గురవారెడ్డి, శ్రీను, భూక్య సైదా, వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, నాగరాజు, వీరస్వామి, వెంకటరెడ్డి, రవి, ప్రతాప్‌రెడ్డి, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న క్లబ్ బాధ్యులు

నేరేడుచర్ల, మే 5: నేరేడుచర్ల వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ చేతి పని శుభ్రత, మంత్రసాని దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేతి పని కార్మికులు, మంత్రసానులు ఎన్నేలమ్మ, నాగమ్మ, యాదమ్మ, మంగమ్మ, సైదమ్మను సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వ్యాపారవేత్త మిర్యాల ప్రసాద్, శోభ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా స్థానిక చలివేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, జోన్ చైర్మన్ గెల్లి లక్ష్మీనర్సింహారావు, వనితా క్లబ్ అధ్యక్షురాలు గరిణె జ్యోతి, రేపాల ఊర్మిళ, నటరాజ్, గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రాము, మధు, వాసు, వెంకన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

● ఎంఈఓ వెంకటాచారి

మఠంపల్లి, మే 5: మండలంలోని పెదవీడు, రఘునాథపాలె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఈ నెల 6 నుంచి 22వ తేదీ వరకు వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి కె.వెంకటాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని పలు అంశాల్లో నైపుణ్యతను పెంచుకోవాలని సూచించారు. శిబిరంలో సాంస్కృతిక అంశాలు, చేతివృత్తులు, చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ తదితర అంశాలపై ఆర్పీలు, వలంటీర్లు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. శిక్షణలో భాగంగా 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో అర్హులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు.

## 'సీనియారిటీ ప్రాతిపదికన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి'



విలేకరులతో మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయులు

కోదాడ, మే 5: ఉద్యోగ విరమణ పొంది ఏడాది పూర్తయినా ఉపాధ్యాయులకు ప్రభుత్వం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించకపోవడం బాధాకరమని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చుండూరు ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు సోమవారం కోదాడ ఎస్టీఓ కార్యాలయం ఆవరణలో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు కుటుంబ బాధ్యతలు, అనారోగ్యాలతో బాధపడుతున్నారని, బెనిఫిట్స్ రాక పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఏడాది కాలం నుంచి బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్న వారికి మంజూరు చేయకుండా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయ సంఘం నాయకులు అని చెప్పుకునే కొందరు దొడ్డి దారిన పైరవీల ద్వారా బెనిఫిట్స్ మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. అక్రమంగా బెనిఫిట్స్ మంజూరు చేసిన అధికారులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. పైరవీల ద్వారా లబ్ధి పొందిన వారి నుంచి రికవరీ చేసి సీనియారిటీ ప్రాతిపదికన బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీఓకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో అసోసియేషన్ కోదాడ డివిజన్ అధ్యక్షుడు శివరామయ్య, రిటైర్డ్ ఉద్యోగులు గోవిందరావు, మేకల సుధాకర్‌రావు, తెల్లాకుల నాగేశ్వరరావు, కె.గోపి, సిరంగి నరసింహారావు, కె.కృష్ణవేణి, టీపీటీఎఫ్ జిల్లా నాయకుడు భిక్షం పాల్గొన్నారు.